వారసత్వ సంపద ఔన్నత్యం గుర్తించాలి



పురాతత్వ రచయిత అక్షత్ గుప్తను సన్మానించిన ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ సభ్యులు

మెట్లబావి వద్ద మాట్లాడుతున్న రచయిత అక్షత్ గుప్త, ఫిక్కి మహిళా అధ్యక్షురాలు రితూ షా

బన్సీలాల్‌పేట్, మార్చి 1 : ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్‌లోని మెట్ల బావి వద్ద శుక్రవారం సాయంత్రం ' పురాణం, సంస్కృతి, వారసత్వ సంపద, నీటి సంరక్షణ' అంశంపై ప్రముఖ పురాతత్వశాస్త్ర, రచయిత అక్షత్ గుప్త మాట్లాడారు. మన ఇతిహాసాలు, పురాణాల్లో పురాతన వారసత్వ సంపద, నీటి సంరక్షణ, సంస్కృతి ఔన్నత్యానికి అద్భుత వివరణ ఉన్నదన్నారు. రేయిన్ వాటర్ ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కల్పనా రమేశ్ మాట్లాడుతూ.. తెలంగాణాలో 300 మెట్లబావుల పురుద్ధరణ జరగాల్సి ఉందన్నారు. బన్సీలాల్‌పేట్‌లోని పురాతన మెట్లబావిని 18 నెలల పాటు శ్రమించి పునరుద్ధరించడంతో భూగర్భ జలాల అభివృద్ధి జరిగిందని, తద్వారా ఈ బావిలో 22 లక్షల లీటర్ల నీరు లభించిందని, అది ఎన్నో ఏండ్ల వరకు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం కలిగి ఉండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు రితూ షా, సభ్యులు పాల్గొన్నారు.

అనంతరం ఆకృతి సంస్థ కళాకారుల కథక్ నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు

అడ్డగుట్ట, మార్చి 1: పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను వేయించాలని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయిశంకర్ అన్నారు. ఐదేండ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, దవాఖానలు, ఇతర రద్దీ చోట్ల అన్నింటా తమ సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని వివరించారు.

నూతన హైస్కూల్ భవనానికి నిధులివ్వండి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఉన్నత పాఠశాల సాధన కమిటీ సభ్యులు

బన్సీలాల్‌పేట్, మార్చి 1 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన హైస్కూల్ భవనానికి రూ.65 లక్షల అదనపు నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉన్నత పాఠశాల సాధన కమిటీ సభ్యులు కోరారు. కమిటీ కన్వీనర్ ఈ.చంద్రశేఖర్, కో-కన్వీనర్ వీజే.శేషగిరిరావు, పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి రూ. కోటి 80 లక్షలను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విద్యాశాఖ ద్వారా మంజూరు చేయించారన్నారు. వాటితో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం తరగతి గదుల నిర్మాణానికి మరో 65 లక్షల రూపాయలు అవసరమవుతుందని అధికారులు అంచనా తయారు చేశారన్నారు. ఆ మేరకు తాము సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానిని కలసి కోరగా వెంటనే స్పందించి సిఫారసు లేఖ రాశారని మంత్రి పొన్నంకు వివరించారు. ఎమ్మెల్యే తలసాని ఇచ్చిన లేఖను వారు మంత్రికి అందజేశారు.

ఫూలే భావజాలంపై మరింత పరిశోధన జరగాలి

- ప్రొఫెసర్ ఎస్‌కే చాహల్

సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 1 : మహాత్మా జ్యోతిబా పూలే భావజాలంపై మరింత పరిశోధన జరగాలని కురుక్షేత్ర యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్‌కే చాహల్ అన్నారు. యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిబా పూలే రీసర్చ్ సెంటర్ (ఎంజేపీఆర్‌సీ) ఆధ్వర్యంలో 'రీవిజిటింగ్ మహాత్మా జ్యోతిబా పూలేస్ విజన్ : ఇట్స్ కాంటెంపరరీ రిలవెన్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ ఎస్‌కే చాహల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీఆర్‌సీ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, మైనారిటీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సయీదా అజీ మున్నీసా, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

లష్కర్‌లో ముమ్మర తనిఖీలు

బేగంపేట్, మార్చి 1: బెంగళూర్‌లోని ఓ కేఫ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో సికింద్రాబాద్‌లో ఉత్తర మండలం పోలీసులు అలర్ట్ అయ్యారు. మహంకాళి, బేగంపేట్ ఏసీపీలు రవీందర్ యాదవ్ నేతృత్వంలో సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్, క్లాక్ టవర్, ఎంజీ రోడ్డు, ప్యారడైజ్, ప్యాట్నీ, బేగంపేట్‌లోని రసూల్‌పుర జంక్షన్, బేగంపేట్ ఎయిర్‌పోర్ట్, శ్యాంలాల్ బిల్డింగ్, స్టేషన్ రోడ్డు తోపాటు ప్రధాన రహదారులపై బాంబు స్క్వాడ్ బృందాలు, ఆయా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో కలిసి రోడ్లపై ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానస్పద వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు లాడ్జ్‌లు సైతం తనిఖీలు చేశారు. పేలుళ్ల నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. ఈ తనిఖీల్లో బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మహంకాళి, మార్కెట్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, మార్చి 1 : లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సచివాలయంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకత వివరాలు మంత్రికి విన్నవించారు. విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆమోదయోగ్యమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి చెప్పారని సాధన సమితి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ సాగర్, సునీల్ పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవంలో భారత్ ముందంజ

ప్రొ. సచిన్ చతుర్వేదితో సెస్ డైరెక్టర్ ప్రొ.రేవతి, ప్రొ.జె.మహేందర్‌రెడ్డి

అమీర్‌పేట్, మార్చి 1 : సాంకేతిక విప్లవంలో భారత్ ముందంజలో ఉన్నదని ఢిల్లీకి చెందిన ఆర్ఐఎస్ డీసీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సచిన్ చతుర్వేది అన్నారు. ఆర్థిక సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం బేగంపేట్‌లోని సెస్ ఆడిటోరియంలో ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయం మాజీ కులపతి ప్రొ.జె.మహేందర్ రెడ్డి అధ్యక్షతన ' సాంకేతికతతో సమానమైన అభివృద్ధి - ప్రపంచ దక్షిణ భారతదేశ అనుభవం ' అంశంపై జరిగి న సదస్సులో ప్రొ. సచిన్ చతుర్వేది మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొ.రేవతి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం..

కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ కార్డినల్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీ గణేశ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లూయిస్, రేమండ్ హర్‌వుడ్, నరేశ్, కార్తీక్ పాల్గొన్నారు.- బొల్లారం, మార్చి 1

బైక్ ర్యాలీ విజయవంతం

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూప రవిప్రసాద్‌గౌడ్

సికింద్రాబాద్,మార్చి 1: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విజయ సంకల్ప యాత్ర విజయవంతం అయింది. యాత్రను పురస్కరించుకొని ద్విచక్ర వాహన ర్యాలీని బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో బీజేపీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్ , సత్యనారాయణ,దత్తు, రాజు, హన్మంతు, చైతన్య, పంపరి యాదగిరి పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్ పరిధిలో..

విజయ సంకల్ప యాత్రలో భాగంగా అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం , తుకారాం గేట్, శాంతినగర్,లాలాపేట్, తార్నాక, సీతాఫల్ మండి నుంచి శివాజీ విగ్రహం, వారాసిగూడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ విగ్రహం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ హాజరయ్యారు.

విజయ సంకల్ప యాత్ర ప్రారంభం

సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ నుంచి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి విజయ సంకల్ప యాత్రను శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర మంత్రికి యువమోర్చా నాయకులు స్వాగతం పలికారు. దేశ సమగ్రత, అభివృద్ధి, భవిష్యత్ కోసం యాత్రను చేపట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. - అడ్డగుట్ట, మార్చి 1

యువతి అదృశ్యం

కంటోన్మెంట్, మార్చి 1: ఓ యువతి అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..ప్రేమలత, అహ్మద్ భార్యాభర్తలు. వారు ఓల్డ్ బోయిన్‌పల్లి, మల్లికార్జున కాలనీ, శేఖర్ హాస్పిటల్ వద్ద నివాసం ఉంటున్నారు. ప్రేమలత అన్న కూతురు మెర్సీగ్రేస్ అలియాస్ సోను కొంతకాలంగా మేనత్త ప్రేమలత వద్ద ఉంటున్నది. గురువారం సాయంత్రం బట్టలు ఆరేయడానికి బయటకు వెళ్లిన సోను తిరిగి రాలేదు. ఇరుగుపొరుగు, తెలిసిన వారి వద్ద ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. దాంతో కుటుంబసభ్యులు శుక్రవారం బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఐతే గతంలో లైంగిక దాడి చేసిన నరేశ్‌పైన అనుమానం ఉన్నట్లు బంధువులు ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం.

నేటి నుంచి బోరబండ మల్లన్న జాతర

ఎర్రగడ్డ, మార్చి 1: బోరబండ మల్లన్న జాతర శనివారం నుంచి ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ జాతర సందర్భంగా సైట్-2 కాలనీలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. గంగ తెప్పోత్సవంతో జాతర మొదలవుతుందని ఆలయ చైర్మన్ మానుక మహేశ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి కల్యాణం, అన్నదానం, పెద్ద పట్నం, అగ్ని గుండాలు, గొలుసు తెంపుట, మల్లన్నకు బోనాలు, ఎల్లమ్మ తల్లికి బోనాలు కొనసాగుతాయన్నారు. సోమవారం నాగవెల్లి కార్యక్రమంతో జాతర ముగుస్తుందని తెలిపారు. జాతరకు నగరం నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను శుక్రవారం పూర్తిచేశారు.

మహిళలు, విద్యార్థినుల కోసం ఉచిత శిక్షణ కేంద్రం

బంజారాహిల్స్, మార్చి 1: పేద, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులకు వృత్తి నైపుణ్యాన్ని కల్పించేందుకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నం.12లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సంస్థ ఫౌండర్ శైలా తల్లూరి శుక్రవారం ప్రారంభించారు. ఆసక్తిగలిగిన మహిళలకు కంప్యూటర్ శిక్షణతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, శానిటరీ నాప్‌కిన్స్ తయారీ లాంటి అంశాల్లో ఉచిత శిక్షణ అందిస్తామని సంస్థ డైరెక్టర్ అరుణ తెలిపారు.

ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినం

మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ

ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎస్ఎఫ్ - టీఎస్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 1: మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి ఆశయాలు సిద్ధించినపుడే ఆత్మశాంతి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్శిగుట్టలో..

బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ సాధనే అమరులకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు గోవిందు నరేశ్, రాగాటి సత్యం, తిప్పరపు లక్ష్మణ్, చిప్పలపల్లి సోమశేఖర్, ఇనుముల నరసయ్య, టీవీ నరసింహారావు, బుర్ర భిక్షపతి, పూజలోల్ల రవి, ఇటిక శ్రీకిషన్, మునిరాతి అరుణ్, వీఎస్ రాజు, కొమ్ము శేఖర్ పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో..

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎంఎస్ఎఫ్ (టీఎస్) అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యసాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల ఆశయాన్ని సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు నాగరాజు, వెంకటిగల్ల వెంకటేశ్, జిల్లా వెంకట్, రమేశ్, గుమిడెల్లి తిరుమలేశ్, కానుగంటి సురేశ్, వెంపటి శ్రీకాంత్, విష్ణు, రవి, శ్రీకాంత్, ప్రేమ్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు జంగిలి దర్శన్, పల్లెర్ల సుధాకర్, తోకల చిరంజీవి, బొర్ర భిక్షపతి, బుర్ర సతీశ్, శివకుమార్, జన్నపాల మహేశ్, రాజీవ్ ప్రదీప్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

హిమాయత్‌నగర్, మార్చి 1: కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం పిలుపు నిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై ఉక్కు పాదం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. దేశ సంపదలైన సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను దశలవారీగా నిర్వీర్యం చేయడం వల్ల కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం చేస్తున్న కార్మిక తిరోగమన విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు.

సీతాఫల్‌మండి విద్యుత్ కార్యాలయం ఎదుట సున్నా బిల్లు అమలుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గృహజ్యోతి పథకం లబ్ధిదారుల గుర్తింపు

సికింద్రాబాద్, మార్చి1: గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ అధికారులు లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. సీతాఫల్‌మండిలోని సబ్‌స్టేషన్ పరిధిలో సున్నా కరెంట్ బిల్లులు అమలు చేయడానికి రంగం సిద్ధమైంది. కరెంట్ బిల్లుతో పాటు రేషన్ కార్డు లింక్ చేసుకున్న వారికి ఈ పథకం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. 200 యూనిట్లలోపు కరెంట్ వాడుకున్న లబ్ధిదారులకు ఈ నెల సున్నా బిల్లు రానుంది. ఈ మేరకు విద్యుత్ అధికారులు కొత్త బిల్లింగ్ యంత్రాలు, సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.

జీరో బిల్ అమలు.. ప్రజాపాలన గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు వినియోగించిన వినియోగదారులు, జీరో బిల్ లబ్ధిదారులకు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి రెవెన్యూ సబ్ డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్ క్రీస్టు నాయక్ , లైన్మెన్లు హరికృష్ణ , షేక్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

'జీరో' విద్యుత్ బిల్లు అందజేత

బన్సీలాల్‌పేట్, మార్చి 1 : అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా 200 లోపు యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగదారులకు 'జీరో' బిల్లులను శుక్రవారం వినియోగదారులకు ప్యారడైజ్ సర్కిల్ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ అందజేశారు. ఈ మేరకు బన్సీలాల్‌పేట్‌లోని బండమైసమ్మ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఇంటింటికి వెళ్లి మీటర్ రీడింగ్ తీయగా 200లోపు యూనిట్లు వాడుకున్న వినియోగదారులకు 'జీరో' బిల్లు తీసి అందజేశారు. కార్యక్రమంర్ల ఎంఆర్‌టీ, డీఈ సమ్మయ్య, ఏడీఈ శివ దుర్గాప్రసాద్, బైబిల్ హౌస్ సెక్షన్ ఏఈ కృష్ణ పాల్గొన్నారు.

వినియోగదారులకు 'జీరో' బిల్లులను అందజేసిన ప్యారడైజ్ సర్కిల్ డీఈ శ్రీధర్, ఏడీఈ శివ దుర్గాప్రసాద్

డ్రైనేజీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్

శంషాబాద్ రూరల్, మార్చి 1: ప్రజలకు డ్రైనేజీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో వివిధ కాలనీల్లో డ్రైనేజీలు నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్.. వెంటనే అక్కడి చేరుకొని శానిటేషన్ అధికారుల సహకారంతో వార్డులోని పలు కాలనీల్లో డ్రైనేజీలను క్లీన్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 4వ వార్డులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే తమలక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి లక్ష్మయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ పద్మారావు సస్పెన్షన్

మణికొండ, మార్చి 1: మణికొండ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ బి.పద్మారావును కాంగ్రెస్ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లా నర్సింహారెడ్డి సస్పెన్షన్ ఆర్డర్ వివరాలను శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మున్సిపలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కస్తూరి నరేందర్ చైర్‌పర్సన్‌గా ఉండగా ఆయనను తొలగించడానికి బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పెట్టారు. ఈ విషయమై పార్టీ తరపున షోకాస్ నోటీసు అందించినప్పటికీ, పద్మారావు ఈ నెల 22న అవిశ్వాసంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ చైర్మన్ నరేందర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తొలగించినట్లు పేర్కొన్నారు.